# కృతజ్ఞతలు

మానవ అక్రమ రవాణా మరియు దుష్పరిణామాలు మరియు అరికట్టే పద్ధతులపై బాలలకు అవగాహన కల్పించేందుకు అవసరమైన పాకెట్ పుస్తకాన్ని తీసుకురావడంలో సహాయపడిన బ్రిటీష్ డిప్యూటీ హై కమిషన్, హైదరాబాద్ వారికి తరుణి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతుంది.

యాదగిరి మరియు భువనగిరి పట్టణాలలో, మానవ అక్రమ రవాణా యొక్క ప్రమాదాలను విద్యార్థులు మరియు యువజనులకు వివరించుట, మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు అవసరమైన ప్రక్రియలు మరియు నిబంధనలపై చట్టం అమలు పరిచే సంస్థల సామర్థ్యాలను పెంపొందించడం తద్వారా బాధితులను రక్షించి వారికి న్యాయం అందేలా చూడడం. అంతే కాకుండా తెలంగాణా రాష్ట్రంలోని యాదద్రి భువనేగిరి జిల్లలో అక్రమ రవాణా సమస్యను ఎదుర్కోవటానికి అవసరమైన చర్యలను ప్రారంభించడానికి భాగస్వాములకు ఒక వేదికను ఏర్పాటుచేయడం.

ఈ పాకెట్ బుక్‌లోని మెటీరియల్‌ను (HELP NGO మరియు తరుణి యొక్క సొంత ప్రచురణల నుంచి రూపొందించబడినది) ఈ సమస్య యొక్క తీవ్రతను విద్యార్థులు అర్థం చేసుకోవడంలో మరియు సాధ్యమైన పరిష్కారాల కొరకు ఈ పుస్తకములో అందించిన సమాచారం సహాయపడుతుందని మేము ఆశిస్తున్నాము.

అంతే కాకుండా, అమూల్యమైన మద్దతును అందించిన శ్రీ మహేష్ భగవత్, IPS, పోలీస్ కమిషనర్, రాచకొండ గారికి, ఈ ప్రాజెక్ట్ ద్వారా అక్రమ రవాణాను అరికట్టడానికి మద్దతునిచ్చేందుకు ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరికి తరుణి సంస్థ రుణపడి ఉంటుంది.

**డాక్టర్ మమతా రఘువీర్ ఆచంట**

తరుణి సంస్థ వ్యవస్థాపకురాలు

| | | |
|---|---|---|
| Contact No. | : | 040-24072038, + 91 98494 18592 |
| E-Mail | : | mamatha@tharuni.org |
| Facebook | : | http://www.facebook.com/Tharuni.org |
| Twitter | : | @Tharuni_org |
| Blog | : | blog.tharuni.org |
| Website | : | www.tharuni.org |

## ఆందోళనకర స్థాయిలో ఈ అక్రమ రవాణా ?

దేశంలో, రాష్ట్రంలో మహిళల, బాలికల అక్రమరవాణా నానాటికీ పెరుగుతోంది. రాష్ట్రంలో దాదాపు పదిహేడు జిల్లాల నుంచి అక్రమ రవాణా సాగుతోందని పోలీసు ఉన్నతాధికారులు ధృవీకరిస్తున్నారు. అంతేగాక దేశంలోని ప్రధాన నగరాలలో సాగుతున్న వ్యభిచార కేంద్రాలకు తరలుతున్న మహిళలు, బాలికలలో ముప్పైశాతం రాష్ట్రానికి చెందిన వారే కావడాన్ని బట్టి పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. వ్యభిచార కేంద్రాలను నిర్వహించే వారిని అరెస్టు చేస్తున్నప్పటికీ వారిపై పోలీసులు కఠినచట్టాలు ప్రయోగించకపోవటంతో షరా మామూలుగానే మకాం మార్చి పాత వ్యాపారాన్నే కొనసాగిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా వ్యభిచార వృత్తిలో డెబ్బై అయిదు మిలియన్ల మంది మహిళలు, బాలికలు మగ్గుతున్నారు. అందులో 25 శాతం భారతదేశానికి చెందిన వారే. వీరిలో అధిక శాతం మైనర్ బాలికలే ఉండటం ఆందోళన కలిగించే పరిణామంగా చెప్పుకోవచ్చు. అంతేగాక మహిళల అక్రమ రవాణాకు భారత్తు వేదికగా



కూడా ట్రాఫికర్స్ ఎంచుకుంటున్నారు. భారత దేశంలో రెండు కోట్ల నలభై లక్షల మంది మహిళలు వ్యభిచార వృత్తిలో ఉన్నారు. ఇందులో 60 శాతం అట్టడుగు వర్గాలకు చెందిన వారు కాగా వీరిలో 30 శాతం 18 ఏళ్ళకు లోబడిన వారే. అలాగే ఇందులో మరి కొన్ని ఆశ్చర్యకరమైన నిజాలు ఉన్నాయి. 40 శాతం బాలికలు అక్రమ నిర్బంధంలో ఉండగా 8 శాతం మంది సమాజం ఆమోదించని సంబంధాల ద్వారా పుట్టిన పిల్లలు కాగా, 10 శాతం వృత్తిలోని మహిళల పిల్లలు ఉన్నారు. ఇదిలా ఉంటే మహిళల అక్రమ రవాణా, వ్యభిచార కేంద్రాల నిరోధంలో గత రెండేళ్ళుగా భారత్ ఏమాత్రం ఆశించిన ఫలితాలను సాధించలేకపోయిందని, ముఖ్యంగా ఈ ఊబిలో మహిళలు, బాలికలు చేరకుండా అడ్డుకట్టవేయటంలో సరైన వ్యూహారచన చేయలేకపోయిందనే విమర్శలున్నాయి. మహిళల అక్రమ రవాణా, వ్యభిచార కేంద్రాల నిర్వహణ వ్యాపారం ద్వారా ప్రతి సంవత్సరం అంతర్జాతీయంగా ఐదు నుంచి ఎనిమిది బిలియన్ డాలర్ల ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నాయని ఐక్యరాజ్య సమితి అంచనా. ఐక్యరాజ్య సమితి అధ్యయనంలో ఆంధ్రప్రదేశ్ కు సంబంధించి భయంకరమైన నిజాలు వెలుగు చూశాయి. ముఖ్యంగా 28 నుంచి 30శాతం మహిళలు, బాలికలను వ్యభిచార కేంద్రాలలోకి బలవంతంగా నెడుతున్నట్లు తేలింది. పేదరికం, నిరక్షరాస్యత, అవగాహన లోపాలు కూడా మహిళలు ఈ ఊబిలోకి నెట్టబడడానికి మరో కారణంగా పరిశీలన పరిశీలనలో వెల్లడైంది.)

## ప్రపంచ వ్యాప్తంగా అక్రమ మానవ రవాణా - కొన్ని వాస్తవాలు

1) ఐక్యరాజ్యసమితి గణాంకాల ప్రకారం మానవ రవాణా దాదాపు ప్రతి ఒక్క దేశాన్ని ప్రభావితం చేస్తుంది. ఇది ఒక అంతర్జాతీయ కోట్ల డాలర్ల వ్యాపారంగా మారింది. ప్రపంచంలోని అత్యంత వేగంగా పెరుగుతున్న క్రిమినల్ పరిశ్రమలలో అక్రమ రవాణా ఉంది. ప్రతి సంవత్సరం సుమారుగా 99 బిలియన్ డాలర్ల వ్యాపారం జరుగుతోంది.



2) ప్రపంచ వ్యాప్తంగా మానవ అక్రమ రవాణా ద్వారా నిర్బంధించబడిన 24.9 మిలియన్ల మంది ప్రజలు నిర్బంధించబడిన కార్మికులుగా ఉన్నారు

3) ఐక్యరాజ్యసమితి గణాంకాల ప్రకారం మొత్తం 71% బాధితులలో 51% మంది మహిళలు మరియు 20% మంది బాలికలు.

4) డ్రగ్స్ అండ్ క్రైమ్ ఆన్ యునైటెడ్ నేషన్స్ ఆఫీస్-2016 గ్లోబల్ రిపోర్టు ప్రకారం అక్రమ రవాణాకు గురియైన వారిలో 54% మంది లైంగిక దోపిడీ కోసం ట్రాఫికింగ్ చేయబడినారు.

5) సెక్స్ ట్రాఫికింగ్‌నకు గురియైన వారిలో మెజారిటీ బాధితులు మహిళలు కాగా పురుషులు కూడా బాధితులవుతున్నారు.

6) డ్రగ్స్ అండ్ క్రైమ్ ఆన్ యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ప్రకారం, ఇతర నేరాలతో పోలిస్తే మానవుల అక్రమ రవాణా కేసుల్లో అధిక సంఖ్యలో మహిళలు దోషులుగా గుర్తించబడినారు.

7) యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలో కూడా సెక్స్ ట్రాఫికింగ్ సంఘటనలు ఉన్నాయి.

8) ప్రపంచవ్యాప్తంగా అత్యధిక సంఖ్యలో బాధితులు ఉన్నప్పటికీ, మానవ రవాణా కేసులలో ప్రాసిక్యూషన్ రేట్లు తక్కువగా కనిపిస్తాయి.

## అక్రమ రవాణాకు సంబంధించి భారత దేశ గణాంకాలు

జాతీయ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాల ప్రకారం 2016 లో 8,000 మందికి పైగా కేసులు నమోదయ్యాయి. 182 మంది విదేశీయులతో సహా 23,000 మంది బాధితులని రెస్క్యూ చేయబడినట్లు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో వెల్లడించింది. వీరిలో 9,034 (58%) మంది వయస్సు 18 సంవత్సరాలు లోపు కావడం విచారకరం.

దేశంలో మొత్తం కేసుల్లో 3,579 (44%) మంది మానవ రవాణాకు సంబంధించిన కేసులతో పశ్చిమబెంగాల్ మొదటి స్థానంలో, రాజస్థాన్ 1,422 (17.5%) కేసులతో రెండవ స్థానములో, 2014లో ముందు యునైటెడ్ ఆంధ్రప్రదేశ్‌లోని భాగంగా ఉన్న తెలంగాణలో 561 కేసులతో మూడవ స్థానంలో (ఆంధ్రప్రదేశ్‌లో 274 కేసులు నమోదయ్యాయి) ఉన్నది. తర్వాత గుజరాత్‌లో 548, మహారాష్ట్రలో 517 మరియు తమిళనాడులో 434 కేసులు నమోదు అయ్యాయి.

యాదగిరి గుట్ట పట్టణములో దాదాపు 112 కుటుంబాలు వేశ్య వృత్తిలో ఉన్నట్లు జిల్లా పోలీస్ శాఖ నిర్వహించిన అధ్యయనంలో తెలిసింది. ముఖ్యంగా వారు గాంధి నగర్, గణేష్ నగర్ మరియు యాదగిరిపల్లి వీధుల్లో స్థిర నివాసం ఏర్పరుచుకొని జీవిస్తున్నారు.

427 మంది దొమ్మర కులానికి చెందినవారిలో 176 బాలికలు మరియు 147 మహిళలు. 104 పురుషులు వారికి సహాయపడుతున్నారు.

క్రైం ఇన్వెస్టిగేటింగ్ డిపార్టమెంట్ (CID) మార్చ్, 2018 లో నిర్వహించిన దాడుల్లో దాదాపు 40 బాలికలు మరియు మహిళలు రేస్క్యూ చేయబడినారు.

ఇది ప్రఖ్యాతమైన దేవస్థానం అయినప్పటికీ గత కొన్ని దశాబ్దాలుగా వ్యభిచార కేంద్రంగా ఉంటుందని మరియు ఇది అందరికి తెలిసిన విషయమే అని స్థానికులు చెప్తుంటారు.

ఈ మధ్య ఒక ప్రయివేట్ నర్సింగ్ హోమ్ పై దాడి చేయగా అక్కడ 40 ఆక్సిటోసిన్ (oxytocin) అంపుల్స్ దొరికాయి. 10 సంవత్సరాలలోపు వయస్సున్న బాలికలకు ఈ హార్మోన్ ఇచ్చి వారిని పుష్పవతిగా మార్చి పడుపు వృత్తిలో దించుతారని అరెస్ట్ చేయబడిన డాక్టర్ తెలిపాడు. పడుపు వృత్తిలో దించబడుతున్న బాలికలంతా అక్రమ రవాణాకు గురైన బాధితులే కావడం విచారకరం.

## అక్రమరవాణా అంటే ఏమిటి?

- ఒక వ్యక్తిని అమ్మటం లేదా కొనటం లేదా బలవంతంగా గానీ, ప్రలోభపెట్టి గానీ, బలప్రయోగం ద్వారా గానీ ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి తరలించడం.
- ఈ రకంగా తరలించడానికి భయపెట్టడం, మోసంచేయటం, అబద్దాలాడటం, బలప్రయోగం చేయటం వంటి విధానాలను ట్రాఫికర్లు అవలంభిస్తున్నారు.

## అక్రమ రవాణా బాధితులు:

- సాంఘికంగా అణగారిన వర్గాలు, బడుగు ప్రజలు, బలహీన వర్గాలవారు ఈ ట్రాఫికింగ్ బారినపడుతున్నారు. వీరిలో
- వయసులో వున్న బాలికలు
- స్త్రీలు
- చిన్నపిల్లలు (ఆడ/మగ)
- పురుషులు

## అక్రమ రవాణా ఉద్దేశ్యం ఏమిటి?

- అక్రమరవాణాకు ప్రధాన కారణం దోపిడి. ఆ దోపిడీ ఈ క్రింది రూపాలలో ఉండవచ్చు.
- బలవంతపు వ్యభిచారం
- శ్రామిక దోపిడి (గనులు, కట్టుబడి పరిశ్రమలు, పరిశ్రమలు)
- బలవంతపు యాచక వృత్తి
- గృహసేవల రంగంలో పనిచేయించడం
- బలవంతంగా వ్యవసాయకూలీలుగా పనిచేయించడం
- పరిశ్రమలో కార్మికులుగా

  మానవ అక్రమరవాణా అధిక ఆదాయవనరుగా మారింది. ఆయుధ వ్యాపారం, మాదక ద్రవ్యాల వ్యాపారం తరువాత అక్రమమార్గాల్లో డబ్బు సంపాదించే మార్గంగా ఇది అభివృద్ధి చెందింది. ఐక్యరాజ్య సమితి అంచనాల ప్రకారం ట్రాఫికర్లు మానవ అక్రమరవాణా ద్వారా 7 బిలియన్ డాలర్ల లాభాలనార్జిస్తున్నారు.

## బాలల అక్రమరవాణా- పెద్దల అక్రమరవాణాకు తేడాలు

- బాలల అక్రమరవాణా (18 సంవత్సరాల వయస్సులోపు), పెద్దల అక్రమరవాణాకు మూడు అంశాలలో ముఖ్యమైన తేడాలున్నాయి.

- పెద్దలకన్నా బాలలే తీవ్ర బలహీనులు కావడం వల్ల అక్రమ రవాణాకు గురయ్యే అవకాశాలు ఎక్కువ..

- సామాన్యంగా పెద్దలు, యువకులు (18 సంవత్సరాలు దాటిన వారు) తమకుతాము ఇష్టపూర్తిగా వలసలపై వెళుతుంటారు, కానీ బాలలు అలా వెళ్ళరు.

- దోపిడికి గురికాగల అవకాశమున్న పరిస్థితిని పెద్దలకు తెలియచేసినప్పుడు వారు అందుకు సమ్మతిని ఇవ్వవచ్చు కానీ పిల్లల విషయంలో ఇది అసాధ్యం. దోపిడి నిమిత్తం బాలలను చేరదీయటం, రవాణా చేయడం తప్పనిసరిగా "మానవ అక్రమరవాణాగా" గుర్తించబడుతుంది..

## అక్రమ రవాణా-వివిధ నిర్వచనాలు

- అక్రమ రవాణా అంటే ఏమిటో నిర్వచించడమే ఒక సమస్య. ఎందుకంటే అక్రమ రవాణా గురించి పనిచేసే వివిధ సంస్థలు, ఏజెన్సీలు వారి వారి అజెండాలు, వారి ప్రయోజనాలు, మౌలికమైన అంశాలలో వారికి గల విభిన్న అభిప్రాయాల వల్ల అక్రమ రవాణాను గురించి ఆమోదయోగ్యమైన నిర్వచనాన్ని కనుగొనటం కష్టం. ఏదో ఒక చర్య లేదా. అలాంటి కొన్ని చర్యలను ఉద్దేశించి కాకుండా ప్రతి విషయం వ్యక్తిగత అక్రమ రవాణా ఫలితంగా అంటూ ప్రతి దాన్నీ అక్రమ రవాణాతో ముడి పెట్టి చెబుతుండటం వల్ల ఏ ఒక్క నిర్వచనం కూడా ఫలానా విషయం అక్రమ రవాణా అని చెప్పే పరిస్థితి లేదు. ఈ అక్రమ రవాణాను ఒక పరిణామంగా చూసినప్పుడు దీనిలో అనేక ప్రక్రియలున్నాయి. అవి వ్యక్తులను సేకరించడం, రవాణా చేయడం(దేశం లోపల-వెలుపలి) గమ్యస్థానంలో వీరిని నియంత్రించడం. ఈ కార్యక్రమాలు సక్రమంగా అమలు చేయటానికి వివిధ వ్యక్తులు, వివిధ గ్రూపులు అనేక దశలలో ఈ అక్రమ రవాణాలో వివిధ రకాలుగా పాలు పంచుకుంటారు.

- ఏమైనప్పటికీ అక్రమరవాణా గురించి ఇక్కడ కొన్ని నిర్వచనాలను ఇవ్వడం జరిగింది. ఐక్యరాజ్యసమితి వ్యక్తిగత అక్రమరవాణాను "భయపెట్టిగానీ, మోసం చేసిగానీ, అధికార దుర్వినియోగం చేసిగానీ, వ్యక్తులు ఉన్న దుర్భర పరిస్థితులను ఆసరా చేసుకొనిగానీ, ఇతరుల అధికార పరిధిలో ఉన్న వ్యక్తుల కొరకు వారికి ప్రతిఫలాన్ని ఇచ్చి లేదా తీసుకొని వారిని దోపిడికి గురిచేసే ఉద్దేశ్యంతో వ్యక్తులను సేకరించుట, మరొక ప్రాంతానికి రవాణా చేయుట, ఇంకొక ప్రాంతానికి బదిలీ చేయుట, తమ వద్ద ఉంచుకొనుట, వేరొక చోట నుండి రవాణా కాబడిన వారిని స్వీకరించుట" అని నిర్వచించింది. ఇక్కడ దోపిడి అంటే లైంగిక దోపిడి, లేదా ఇతర విధాలుగా దోపిడికి గురి చేయుట, బలవంతంగా శ్రామికులుగా మార్చటం, బానిసలుగా చేయటం, వివిధ రూపాల బానిస వృత్తికి వినియోగించుట, శరీరావయవాలను తొలగించుట మొదలైనవి.

- గ్లోబల్ అలయన్స్ ఎగనెస్ట్ ట్రాఫికింగ్" మహిళా అక్రమరవాణాను "వ్యక్తిని / వ్యక్తులను హింసించి, హింసపెడతామని భయపెట్టికానీ, ఆయా వ్యక్తులతో తమకున్న సంబంధాన్ని అడ్డుపెట్టుకొని వారిని భయపెట్టిగానీ, మోసగించిగానీ వారిని సేకరించి, దేశం లోపల లేదా దేశాన్ని దాటించి చట్ట వ్యతిరేకంగా, ఇతరుల అదుపులో ఉంచడం" అని నిర్వచించింది.

- ఆఫీస్ ఆఫ్ డ్రగ్స్ కంట్రోల్ అండ్ క్రైమ్ ప్రివెన్షన్ వారు " వ్యక్తులను బలవంతం చేసిగానీ లేదా బలప్రయోగంతోగానీ, మోసంచేసి, భయపెట్టి, వారున్న దుర్భర పరిస్థితులను ఆసరా చేసుకొని, వారిపై అధికారం గల వ్యక్తులకు డబ్బిచ్చి వారి అనుమతి పొంది, వ్యక్తులను దోపిడి చేసే ఉద్దేశ్యంతో సేకరించడం, రవాణాచేయటం, తమ వద్ద ఉంచుకోవడం. ఇతరుల నుండి పొందటాన్ని" అక్రమరవాణాగా నిర్వచించారు.

## మానవ అక్రమరవాణాకు కారణాలు ముఖ్యమైనవి :

- పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, ఇతర వృత్తి పనులు తెలియకపోవుట, లింగవివక్ష

## ఇతర కారణాలు:

- స్త్రీల, బాలల హక్కుల అణచివేత
- స్త్రీ, బాలల పట్ల వివక్షతను, అసమానతను ప్రదర్శించుట
- తక్కువ కులం, గిరిజన మహిళల పట్ల తీవ్రవివక్ష, దోపిడి.
- కుటుంబం నుండి రక్షణ లేకపోవుట
- ప్రకృతి వైపరీత్యాలు (వరదలు, కరువు, పంట నష్టాలు, భూకంపాలు మొ॥వి)
- అధిక ఋణాలు
- కట్టుబానిసత్వము
- విహార స్థలాలు
- అవినీతి
- రాజకీయ అనిశ్చితి
- సాంఘిక, ఆర్థిక అసమానతలు
- రక్షణ లేకపోవుట
- వలసలు
- వరకట్న దురాచారం

## అక్రమరవాణా ఎలా జరుగుతుంది?

- నిరక్షరాస్యులైన, అనాథలైన, బీద, లింగవివక్ష, హింసకు గురైన బాలికలను వివాహం పేరుతో ఆకర్షించటం.
- బాధిత మహిళలను, భయపెట్టడం, వంచన చేయటం ద్వారా, గ్రామీణ యువకులను, అమాయకులను, పట్టణాలలో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెచ్చి వారిని బలవంతపెట్టి, భయపెట్టి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఉపయోగించడం వారికి తక్కువ కూలీలు ఇవ్వటం, పేదరికంలో ఉన్న మహిళలను, పురుషులను బలవంతంగానూ, భయపెట్టి బానిసలుగా పనులు చేయించుకోవడం పేదరికంలోనూ, ప్రకృతి వైపరీత్యాలతో బాధపడుతున్న వ్యక్తుల పై దృష్టి పెట్టి అలాంటి వారిని

మాయమాటలతో పట్టణాలకు తరలించి అమ్మివేయటం.

- పిల్లలను, బాలికలను, కిడ్నాప్ చేసి అమ్మటం.

## ఈ అక్రమరవాణా ఎప్పుడు జరుగుతుంది?

- దీనికి ఇప్పుడు, అప్పుడు అని ఒక సమయం లేదు, నిరంతరం జరుగుతూనే వున్నది. మన కళ్లముందే జరుగుతున్నా మనం కనిపెట్టలేక పోతున్నాం.
- పైన తెలిపిన సందర్భాలలోనే కాకుండా కొన్ని ప్రత్యేక సందర్భాలలో కూడా ఈ అక్రమరవాణా కొనసాగుతున్నది. కొన్ని సందర్భాలను రవాణాదారులు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. అలాంటి సందర్భాలు కొన్ని:
- పంటల కోతల సమయానికి ముందు
- కరువు కాటకాల సమయాలలో –
- ప్రకృతి వైపరీత్యాల సమయాలలో
- రాజకీయ ఆర్థిక అశాంతి
- పండుగ పరవళ్లు సందర్భాలలో యాత్రా స్థలాల్లో, ప్రయాణ సమయంలో

## అక్రమ రవాణా ఎందుకు పెరుగుతుంది?

- అక్రమరవాణా ఒక పరిశ్రమగా ఎదిగింది. ఇతర పరిశ్రమలలాగానే అత్యధిక లాభాల కొరకు ట్రాఫికర్లు ఇందులోకి దిగుతున్నారు.
- వ్యక్తి ఆదాయం, ఇతరులతో ఉండే సంబంధాలు మెరుగయ్యే కొద్దీ ఈ రవాణాను ఇంకా ఇంకా ప్రోత్సాహిస్తున్నారు.
- సాంఘిక దురాచారాలకు, అనైతికతకు కావలసిన వ్యక్తులను సమకూర్చుటకు

## ట్రాఫికింగ్ వల్ల సమస్యలు?

- ట్రాఫికింగ్ బాధితులు కట్టుబానిసల్లాగా పనిచేయవలసి ఉంటుంది. వారికి ఏ విషయంలోనూ స్వేచ్ఛ ఉండదు, చెప్పిన పని మారుమాట్లాడక చేయవలసి ఉంటుంది. అత్యంత ప్రమాదకరమైన పనులకు వినియోగించబడతారు. యజమాని చెప్పిన పనులు చేయని సందర్భాలలో క్రింది బాధలకు గురి చేయబడతారు.
- ఆకలికి మార్చడం
- చీకటి గదిలో బంధించడం
- కొట్టడం, గాయపరచడం
- సిగరెట్లు, ఇతర కాలుతున్న వాటితో కాల్చడం
- బలవంతంగా మత్తు పదార్థాలు లాంటివి త్రాగించటం

- వికలాంగులుగా మార్చడం
- మానసికంగా బాధించడం
- అత్యాచారం చేయడం

**శారీరక, మానసిక ప్రభావాలు:**

- ఇతరులను చూస్తేనే భయపడతారు
- మానసిక రోగగ్రస్తులవుతారు
- సమాజం నుండి పారిపోయేందుకు ఎందుకు ప్రయత్నిస్తారు.
- ఇతరుల పట్ల నమ్మకం, విశ్వాసం కోల్పోతారు.
- అనారోగ్యం
- హెచ్.ఐ.వి./ఎయిడ్స్ బారిన పడే అవకాశాలున్నాయి.
- ఇతర లైంగిక వ్యాధులు సోకుతాయి
- అకాలమృత్యువుకు గురయ్యే అవకాశం వుంది.
- ఒకవేళ రవాణాకు గురికాబడిన వ్యక్తి పారిపోయి ఇంటికి చేరినా, వారిని కుటుంబంగానీ, సమాజంగానీ ఆదరించుటలేదు.

**అక్రమ రవాణాకి గురైన వారి శారీరక ఆరోగ్య పరిస్థితి**

- అక్రమ రవాణాకి గురైన బాలలు వివిధ రకాల వ్యాధులకు గురవుతారు. ముఖ్యంగా సుఖవ్యాధులతో పాటు హెచ్ఐవి వ్యాధికి గురవుతారు.
- అక్రమ రవాణాకి గురైన బాలలు వివిధ రకాల బాధలకు గురి కావాల్సి వస్తుంది. అందులో తలనొప్పి, ఛాతినొప్పి, ఊపిరితిత్తుల వ్యాధులు, మగతగా ఉండటం, కడుపునొప్పి, పొత్తికడుపునొప్పి, వీపు నొప్పి, చర్మవ్యాధులు
- చిన్న వయస్సులోనే గర్భం దాల్చటం
- గర్భం దాల్చటం వల్ల వచ్చే ఇబ్బందులతో పాటు తనకు తెలియకుండానే లేదా బలవంతంగా గర్భం తీసేయించటం జరుగుతుంది.
- బాధితురాలు ఎక్కువసార్లు శారీరక హింసకు గురికావటం(తన్నులు తినటం)తో పాటు ఆహారం కూడా లభించని దుస్థితి
- బాధితురాలు మర్మావయాలపై పుండ్లు, గాయాలు, మంటలతో బాధ పడాల్సిన పరిస్థితి

## మానసిక స్థితి

- ఆందోళనగా ఉండటం/ఒత్తిడికి లోనవటం
- జీవితంపై ఆశలేకపోవటం
- అవమానకరంగా, సిగ్గుగా
- ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన
- నిద్ర పట్టకపోవటం/అతిగా నిద్రపోవటం
- పదే పదే బాల్యం గుర్తుకురావటం, ఆవేశం, ఆందోళన, తనపై తనకి విరక్తి, కోపం, తనలో తాను నవ్వటం, ఏడవటం, మాట్లాడుకోవటం, కసి
- హఠాత్తుగా ఏడవటం, ఎవరితో మాట్లాడకపోవటం, ఒంటరిగా ఉండటానికి ప్రయత్నించటం
- సమాజం వెలివేసినట్లుగా భావన
- తనపై తనకి నమ్మకం లేకపోవటం(కొన్ని సార్లు తనపై తనకి ఎక్కువ నమ్మకం, ఆత్మవిశ్వాసం)
- తనను తాను అసహ్యాహించుకోవటం
- తనకు తానే ఒకే అమ్మకపు సరుకుగా భావించుకోవటం
- తనకు తానే కించపరుచుకోవటం
- ఒక్కొక్క సారి తాను ఏది చేస్తుంది తనకే తెలియకపోవటం
- ప్రేమ–సెక్స్‌కి మధ్య తేడాని గుర్తించలేని స్థితి
- నీరసం ఆవహించడం కొన్ని సమయాల్లో ఫిట్స్‌కి గురి కావటం

## ప్రవర్తనలో వచ్చే మార్పులు:

- బాధితులు పెద్దవారు వలే ప్రవర్తిస్తుంటారు.
- బాధితులు / సామాజిక వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొంటారు.
- బాధితులు కుటుంబ సభ్యులతో గానీ, తోటి స్నేహితులతో కాని కలవలేని స్థితిలో వుంటారు.
- బాధితులు మత్తు పదార్థాలు–మత్తు పానీయాలకు బానిసలవుతారు.
- కోపాన్ని బాధని అణచుకొని ఉండటం వల్ల అప్పుడప్పుడు తీవ్ర స్థాయిలో ఇతరులపైన విరుచుకుబడతుంటారు.లేదా తనకు తానే గాయపరుచుకుంటుంటారు.

- బాధితులు తన చుట్టూ ఉండే వ్యక్తులపై కోపం–అసహ్యం కలిగి ఉండటం సహజం
- బాధితులు దోపిడికి–హింసకు గురి చేసే వ్యక్తుల పైనే ఆధారపడి జీవించే స్థితిలోకి వస్తారు.
- బాధితులు సాధారణ జీవితం గడపలేము అనే ఆలోచనకు రావటం
- బాధితులు తమను కుటుంబ సభ్యులు సమాజం ఆదరించరని, అసహ్యహించుకుంటారనే భావనతో ఉండటం వల్ల ఇంటికి వెళ్ళటానికి ఇష్టపడని స్థితిలో ఉంటారు.
- జీవించాలనే ఆశ లేనందున ఆహారం విషయంలో శ్రద్ధ చూపరు ( అసలు తినకపోవటం, అమితంగా తినటం, పరిమితంగా తినటం)
- ప్రతి చిన్న విషయానికి అతిగా స్పందిస్తుంటారు.
- బాధితులు తనను నష్టపరిచే వ్యక్తులని తెలిసినా) వారిని దూరంగా ఉంచకపోవటం
- బాధితులు ఇతరులను లైంగికంగా రెచ్చగొట్టేవిధంగా వేషధారణ, దుస్తులు ధరించటం
- బాధితులు ఇతరులను వేధింపులకు గురి చేయడం లేదా అబద్దాలు చెప్పడం, మోసం చేయటం ప్రారంభిస్తారు.
- బాధితులు తనకు రక్షణనిచ్చే వాతావరణం నుంచి పారిపోటానికి ప్రయత్నిస్తారు.
- బాధితులు అసమర్థులమనే భావనలోకి రావటం ఫలితంగా తమ ఇష్టానుసారంగా ప్రవర్తించటం
- బాధితులు తమకు తామే హాని చేసుకోవటానికి సిద్దపడటం(గాయపరుచుకోవటం)

## అక్రమరవాణాలో నిమగ్నమైన వ్యక్తులను గుర్తించడమెలా?

- ఈ వ్యాపారంలో పాలుపంచుకుంటున్న వ్యక్తులను గుర్తించడం కష్టం. కారణం వారు మనలోనే వున్నారు. వారికి ప్రత్యేకమైన గుర్తింపు కానీ, ఇతర విధాలుగా ప్రత్యేకతలు గానీ లేవు..
- మనం అత్యంత జాగరూకతతో వ్యవహరించటం ముఖ్యం. బాగా తెలిసిన వ్యక్తులు కూడా ఇందులోని వారే కావచ్చు.

## అక్రమ రవాణాలో పాల్గొనే వ్యక్తులు వారి భాగస్వాములు:

- క్రింద తెలియచేయబడిన వ్యక్తులు ఈ వ్యాపారంలో పాల్గొనే అవకాశాలున్నాయి. కొనుగోలు దారులు (డబ్బు ఉన్న వ్యక్తులు, గనులు, పరిశ్రమల యజమానులు, వ్యభిచారులను తయారు చేయువారు, వ్యభిచార గృహ నిర్వాహకులు చట్టవ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొను మాఫియా వర్గాలు.
- కొంతమంది పోలీసులు, వీసా, పాస్ పోర్టు జారీచేయు ఇతర ప్రభుత్వ అధికారులు.
- కొంత మంది రాజకీయ నాయకులు, (వారి వారి స్వంత ప్రయోజనాన్ని ఆశించి ట్రాఫికింగ్ అభివృద్ది చెందటానికి దోహదపడుతున్నారు) తెలిసిన వ్యక్తులు, బంధువులు, స్నేహితులు, ఇరుగు పొరుగువారు, భూస్వాములు, కట్టుబడి పనులు చేయించే కాంట్రాక్టర్లు.

- అక్రమ రవాణాకు గురికాబడిన వ్యక్తులే ఆ తరువాత అక్రమరవాణా ఏజంట్లుగా మారడం,
- ట్రక్కులు, బస్సుల డ్రైవర్లు, కండక్టర్లలో కొందరు వ్యక్తులు, టాక్సీ మరియు ఆటో రిక్షాల వారు.
- తరచు విదేశాలకు, ఇతర ప్రాంతాలకు తిరుగుతుండేవాళ్లు
- మత్తుపదార్థాల రవాణాదారులు
- మధ్యవర్తులు, తార్పుడుగాళ్లు
- ఇతర దేశాలలో, పట్టణాలలో మంచి జీవన భృతి కల్పిస్తామని మోసపు మాటలు చెప్పేవారు.
- కొన్ని ఉపాధి కల్పన సంస్థలు వారి ఏజంట్లు.

## సహకారాన్ని అందించే వ్యక్తులు

- ఈ వ్యాపారం కొరకు డబ్బు పెట్టుబడి పెట్టేవారు, కోరినంత మందిని అందుబాటులో ఉంచుటకు మధ్యవర్తులు, తార్పుడుగాళ్ళు
- అక్రమ రవాణాకు తగిన వ్యూహాన్ని రచించేవారు.
- తప్పుడు ధృవపత్రాలు, ఇతర డాక్యుమెంట్లు తయారు చేసేవారు.
- అవినీతి అధికారులు, వారికి అండనిచ్చేవారు
- విషయాలను సేకరించేవారు
- బలప్రయోగం చేసే వ్యక్తులు
- సరిహద్దులు దాటించుటకు, వారి ప్రయాణం, వసతి మొదలగునవి కల్పించే వ్యక్తులు
- వ్యభిచార గృహాలను నడిపేవారు, నిర్వహించే వారు.
- అక్రమ రవాణా సందర్భంగా బాధితులను కనిపెట్టి ఉండేవారు. కొద్ది మంది హోటల్ యజమానులు.

## ట్రాఫికింగ్‌కు వ్యభిచారానికి తేడా?

## వ్యభిచారం:

- వ్యభిచారం అంటే 18 సంవత్సరాలు దాటిన మహిళలు ఆ వృత్తి గురించి తెలుసుకొని అందులోకి ప్రవేశించడం.
- ఈ వృత్తిలో కొందరు మహిళలు శాశ్వతంగా ఉంటారు. మరికొందరు కొద్ది రోజులు వృత్తిలో ఉండి తిరిగి ఇళ్ళకు వెళతారు.
- కొన్ని సందర్భాలలో మినహా ఎక్కువ సార్లు కష్టమర్లను నిరాకరించే వీలుంటుంది. అలాగే వారి ఇష్టానుసారం కష్టమర్లకు ఎంపిక చేసుకునే వెసులుబాటు ఉంటుంది. వృత్తిలోని మహిళలు కుటుంబం/గ్రామంలో సంబంధాలు ఉంటాయి (ఎక్కువ మందికి)

- ఎక్కువ మంది మహిళలు ఈ వృత్తి ద్వారా వచ్చే డబ్బుతో కుటుంబాన్ని పోషించుకునే అవకాశం ఉంది.

- ఈ వృత్తి చేయాలా వద్దా అనే అధికారం ఆ మహిళలకే ఉంటుంది. అయితే సమాజంలో వీరికి ఛీత్కారాలు, వివక్షత ఎదురవుతాయి.

**ట్రాఫికింగ్:**

- 18 సంవత్సరాల లోపు బాలికలు బలవంతంగా వ్యభిచార వృత్తిలోకి దించబడతారు. ఏ పని చేయబోతున్నారో ముందుగా వారికి తెలియదు. ఎవరైనా వచ్చి రక్షించడం, లేదా తప్పించుకుంటే తప్పా వీరు బలవంతంగా వృత్తిలో కొనసాగుతుంటారు.

- వారి శరీరం మీద వారికి ఎలాంటి స్వేచ్ఛా ఉండదు. వ్యభిచార గృహ నిర్వాహకులు చెప్పినట్ల వినక తప్పదు. వినకపోతే చిత్రహింసలు అనివార్యం.

- తమకు నచ్చని కష్టమర్లను నిరాకరించలేని దుస్థితి.

- అనారోగ్య పరిస్థితులలో కూడా కష్టమర్లను ఆనందపరచాల్సిన దీన స్థితి.

- ఈ నేపధ్యంలో మానవ హక్కులు, బాలల హక్కులు హరించబడతాయి.

- గాయాలు, దెబ్బలు, అవమానాలు, సమాజంపై నమ్మకం సడలటం చివరకు తమపై తామే నమ్మకాన్ని కోల్పోయే పరిస్థితులు నెలకొంటాయి.)

## బాలలు అంటే?

18 సంవత్సరాల లోపువారంతా బాలలే. బాలలకు కూడా హక్కులున్నాయి. వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత పెద్దలపై ఉంది. 1989లో బాలల హక్కుల విశ్వ తీర్మానం ఆమోదం పొందింది. 1992 డిసెంబర్లో తీర్మానంపై భారతదేశం సంతకం చేసింది. ఈ విశ్వ తీర్మానంలో 18 సంవత్సరాల లోపు వారందరినీ బాలలుగా గుర్తించారు. బాలల అనుమతి ఉన్నా లేకపోయినా తల్లిదండ్రుల అనుమతి ఉన్నా లేకపోయినా వారిని ఒక చోట నుండి మరొక చోటకి తరలించకూడదు. వ్యభిచారం, యాచక ఇతర కఠిన వృత్తుల్లో బాలలను ఉపయోగించకూడదు. బాలల శ్రమను దోచుకోవడం చట్ట రీత్యా నేరం. ఈ తీర్మానం ప్రకారం మొత్తం 54 ఆర్టికల్స్‌ను 4 విభాగాలుగా విభజించారు. జీవించే హక్కు రక్షణ పొందే హక్కు అభివృద్ధి చెందే హక్కు భాగస్వామ్య హక్కు బాలలకు కల్పించారు. 18 సంవత్సరాల లోపు బాలలందరికీ ఈ హక్కులు వర్తిస్తాయి. అన్ని రకాల దోపిడీల నుండి బాలలను రక్షించి వారు అభివృద్ధి చెందేలా పెద్దలు కృషి చేయాలి.

## కొన్ని కుటుంబాలు తమ పిల్లలను అమ్ముకుంటున్న విషయం వాస్తవమేనా?

- కొన్ని చోట్ల తల్లులు, తండ్రులు పిల్లలను అమ్మిన ఉదాహరణలు లేకపోలేదు.

- బీదరికం వల్ల, తప్పనిసరి పరిస్థితులలో కొంతమంది తమ పిల్లలను ఇంటికి దూరంగా పనికోసం పంపిస్తున్నారు. దానివల్ల వాళ్ళు కష్టాల బారిన పడి ఆ తరువాత అక్రమరవాణా – దోపిడిదారుల చేతుల్లో పడుతున్నారు.

- చదువులేక పోవటం, వలసలకు సంబంధించిన వాస్తవ పరిస్థితులపై అవగాహన లేకపోవడం వల్ల అక్రమ రవాణాదారుల మాయమాటలకు అమాయకులైన తల్లిదండ్రులు మోసగించబడుతున్నారు. పిల్లవాడి భవిష్యత్తు బాగుంటుందని, కుటుంబం బాగుపడుతుందని వారు చెప్పే మోసపు మాటలు నమ్మి మాత్రమే పిల్లలను పంపుతున్నారు.
- తమ పిల్లల కోసం పెద్ద పెద్ద అవకాశాలు ఎదురు చూస్తున్నాయని నమ్మకపోయినా, అమానవీయ పరిస్థితులలో, బానిస బ్రతుకును గడపాల్సిన నిజాన్ని తల్లిదండ్రులు గ్రహించలేకున్నారు.
- బహుశా కొన్ని సందర్భాలలో తల్లిదండ్రులు తమ పిల్లలకు బాగా డబ్బు చెల్లిస్తామని ప్రమాణం చేసిన వ్యక్తుల వద్ద పని చెయ్యటానికి కొంతకాలం వరకు పంపవచ్చు.

## అక్రమరవాణాకు గురైన బాలల పరిస్థితి ఏమిటి?

అక్రమ రవాణా బాలల ప్రాథమిక హక్కులను హరిస్తుంది. అక్రమరవాణాకు గురైన బాలలు బానిసలుగా మారతారు. ఈ క్రింది విధంగా దోపిడికి గురవుతారు.

- వారి వారి ప్రాంతాల నుండి బలవంతంగా ఎత్తుకుపోబడతారు.
- భౌతిక వేధింపులకు అత్యాచారాలకు గురవుతారు.
- నీచంగా చూడబడతారు.
- ఆరోగ్య పరంగా తీవ్ర ప్రమాదాలకు గురికాబడతారు.
- భయకంపితులవుతారు.
- చదువుకునే హక్కు కోల్పోతారు.
- వివక్షతకు గురవుతారు.
- ఆర్థికదోపిడికి గురవుతారు.
- కష్టతరమైన పనులలో నియోగించబడతారు.
- విశ్రాంతి లేకుండా దీర్ఘకాలం పనిచేయవలసి ఉంటుంది
- వేతనాలు అసలే ఉండకపోవచ్చు. ఉన్నా చాలా తక్కువగా ఉంటాయి.

## అక్రమ రవాణా వల్ల బాలలు ఎదుర్కొనే ఇబ్బందులు

| కుటుంబ సభ్యులు అమ్మినప్పుడు | పెళ్ళి పేరుతో మోసగించబడినప్పుడు | ఉద్యోగాల పేరిట తరలించబడినప్పుడు |
|---|---|---|
| • బాలలు లైంగిక వేధింపులకు/దోపిడికి, హింసకు గురి కావచ్చు.<br>•బలవంతపు లైంగిక చర్యలు అత్యాచారాల వల్ల బాలలు హెచ్ఐవి/ఎయిడ్స్ ఇతర లైంగిక వ్యాధులకు గురికావచ్చు.<br>• లైంగిక హింస, దోపిడీల వల్ల బాలలు మానసిక గురికావచ్చు.<br>• బాలలు వ్యాపారపరమైన లైంగిక దోపిడికి అనగా వ్యభిచారం, సెక్సు టూరిజం, అశ్లీల సాహిత్యం కొరకు, బాలలతో లైంగిక చర్యలు జరిపే వారి కోసం వినియోగింపబడవచ్చు.<br>• బాల కార్మిక వృత్తిలోకి, కట్టుబానిసలుగా, క్లిష్టమైన పరిస్థితులలో పనిచేయడానికి బలవంతంగా దింపవచ్చు.<br>• సర్కస్లోను, ఒంటెలపై జాకీలుగా వాడే రాక్షస క్రీడలలోకి దింపవచ్చు.<br>•చట్టవ్యతిరేక కార్యాకలాపాలలో పాల్గొనేటట్లు బలవంతం చేయవచ్చు. ఉదాహరణకు భిక్షాటన, శరీర అవయవాలను అమ్ముకోవటం, అక్రమ ఆయుధవ్యాపారం మాదక ద్రవ్యాల రవాణా లాంటివి.<br>•ఘరణలు జరిగే ప్రాంతాలలో బాలలను సైనికులుగా ఉపయోగించవచ్చు.<br>•తీవ్ర మానసిక జబ్బులతో పాటు, హెచ్ఐవి ఇతర సుఖవ్యాధులకు గురి కావచ్చు.<br>•ఒంటరితనం, సాంఘిక వివకత వల వ్యక్తిగత గుర్తింపు కోల్పోవటం జరుగుతుంది.<br>•దేశం లోపల లేదా దేశాన్ని దాటించే విధంగా తిరిగి అక్రమ రవాణాకు గురి కావచ్చు. | •భర్తకు గల హెచ్ఐవి, పెళ్ళికుమార్తెకు కూడా రావచ్చు.<br>• పెళ్ళి కుమార్తె లైంగిక హింసకు, వేధింపులకు గురి కావచ్చు.<br>• డబ్బు కోసం అనేక మందితో<br>• వ్యభిచరించమని భర్తే బలవంతం చేయవచ్చు.<br>చెప్పిన ప్రాంతానికి కాకుండా వేరే ప్రదేశానికి పెళ్ళి కుమార్తెను తరలించవచ్చు.<br>• లైంగిక హింస, వేధింపులకు గురి కావడం వల్ల పెళ్ళి కుమార్తె మానసిక వ్యధకు లోను కావచ్చు.<br>• పెళ్ళి కుమార్తెను వేశ్యాగృహానికి అమ్మవచ్చు. ఇంట్లోను, వీధిలోను వ్యభిచార వృత్తి కొరకు, వ్యాపారపర లైంగిక దోపిడికి గురి చేయవచ్చు.<br>• బలవంతంగా శ్రామిక దోపిడికి గురి కావచ్చు.<br>• భౌతిక, లైంగిక హింసలకు మరలా మరలా గురి కావచ్చు.<br>•హెచ్ ఐవి, ఇతర సుఖవ్యాధులు సంక్రమించవచ్చు.<br>•రుణగ్రస్తులుగా, బానిసలుగా మార్చవచ్చు.<br>•ఒంటరితనం, సాంఘిక వివక్షతతో, గుర్తింపు కోల్పోయి, బ్లాక్ మెయిలింగ్కు గురి కావచ్చు<br>• దేశం లోపలనో, దేశం వెలుపలికో మరలా రవాణా కావచ్చు. | •తరలించబడిన గ్రామస్తులు లైంగిక హింసకు, దోపిడికి గురి కావచ్చు.<br>•సురక్షితం కాని బలవంతపు లైంగిక చర్యల వల్ల హెచ్ఐవికి ఇతర సుఖవ్యాధులకు గురి కావచ్చు<br>• చెప్పిన ప్రాంతానికి కాకుండా వేరే వ్యధకు ప్రదేశాలకు తరలించవచ్చు.<br>• లైంగిక హింస, వేధింపులకు గురి కావడం వల్ల వీరు మానసిక వ్యాధులకు లోను కావచ్చు.<br>• వీరంతా శ్రామిక దోపిడికి గురి కావచ్చు. భౌతిక వేధింపులకు, లైంగిక హింసకు మరల మరల గురి కావచ్చు..<br>• హెచ్ ఐవి ఇతర సుఖ వ్యాధులు – సంక్రమించవచ్చు. రుణగ్రస్కులుగా కట్టు బానిసలుగా – మార్చవచ్చు.<br>•చట్టవ్యతిరేక కార్యకలాపాలైన భిక్షాటన, శరీర అవయవాల తొలగింపు, దొంగతనాలు, అక్రమ ఆయుధ వ్యాపారం, మాదక ద్రవ్యాల రవాణాకు ఉపయోగించబడవచ్చు.<br>•ఒంటరితనం, సాంఘిక వివక్షతతో ఉనికిని కోల్పోవచ్చు.<br>•దేశం లోపల గానీ, దేశం వెలుపలికి గానీ మరలా రవాణా అయ్యే అవకాశం ఉంటుంది. |

## బాలల అక్రమరవాణాకు - హెచ్.ఐ.వి./ఎయిడ్స్ కు గల సంబంధం ఏమిటి?

వీటికి ప్రత్యక్ష సంబంధం ఉంది. లైంగిక దోపిడి కొరకు రవాణా కాబడిన బాలలు, మహిళలు బలవంతంగా వ్యభిచార వృత్తిలోకి నెట్టబడతారు. అనేకమంది విటులతో సురక్షితం కాని పద్ధతుల్లో సెక్స్ వర్క్లో పాల్గొనాల్సివస్తుంది. వీరికి సురక్షిత పద్ధతులపై అవగాహన ఉన్నా, కండోమ్లు అందుబాటులో ఉన్నా, విటులను కండోమ్లు వాడే విషయంలో ఒప్పించగల శక్తి ఉండదు. కొన్ని సందర్భాలలో చిన్న వారికి హెచ్.ఐ.వి. / ఎయిడ్స్ ఉండదనే ఉద్దేశ్యంతోనే విటులు వారిని కోరుకుంటున్నారు. అదేవిధంగా కన్యలతో సెక్స్ లో పాల్గొంటే సుఖవ్యాధులు, హెచ్.ఐ.వి. తగ్గుతాయనే నమ్మకాలు ప్రచారంలో ఉండటం వల్ల వీరికి ఈ వ్యాధులు సంక్రమించే అవకాశం తీవ్రంగా ఉంది..

మరి కొందరు బాలలను బాల కార్మికులుగా, ఇంటి పనులలో పెడుతున్నారు. ఇలాంటి బాలలు యజమానుల వల్ల, వారి కుటుంబ సభ్యుల వల్ల లైంగిక దోపిడికి గురవుతున్నారు. ఈ కారణంగా కూడా హెచ్ఐవి సోకే ప్రమాదం ఉంది.

- తమ ప్రమేయం లేకుండా వీరంతా గ్రామాల నుండి పట్టణాలకు అక్కడ నుండి మరొక చోటకు తరలించబడుతుంటారు.
- వీరి శరీరాన్ని అమ్ముకొని ఇతరులు లబ్ది పొందుతుంటారు.

## కేస్ స్టడీ

హెల్ప్ హోమ్లో నా జీవితం ప్రశాంతంగా సాగుతోంది. నాలాగా మోసపోయి ఇక్కడకు చేరిన వారు మళ్ళీ చీకటి జీవితాల్లోకి ప్రవేశించకుండా వాళ్ళలో మార్పు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నా అంటోంది మంజరి. మంజరి గతం బాధల మయం, అత్తగారింట్లో ఆమె పడ్డ ఆరళ్ళు అన్నీ ఇన్నీ కాదు. వ్యభిచారం చేయమని భర్త, ఆడపడుచు, అత్తగార్ల వేధింపులతో నిత్యం సతమతమయ్యేది. ఇపుడు ఆమెకు ఆ వేధింపులు లేవు. హెల్ప్ హోమ్లో చేరిన కొత్తల్లో గతాన్ని తలుచుకొని బాధపడేది. అయితే కౌన్సిలింగ్ ఆమెలో పెను మార్పు తెచ్చింది. వ్యభిచారం చేయనని నిరాకరించినందుకు మంజరి భర్త ఆమెను ఇంటి నుంచి వెళ్ళగొట్టాడు. దీంతో పుట్టింటికొచ్చిన మంజరి గత్యంతరం లేని పరిస్థితులలో గుంటూరు సమీపంలోని పేపర్ మిల్లులో పనికి చేరింది. చాలీ చాలని వేతనంతో ముసలి తల్లిని చూసుకుంటూ కాలం గడుపుతున్న సమయంలో ఓ మోసగాడు మంజరికి ఎరవేశాడు. మాయ మాటలు చెప్పి ఓ బ్రోతల్ హౌస్లో అమ్మేశాడు. అక్కడ మేడమ్ ఒత్తిళ్ళతో మంజరి కూడా వృత్తిలోకి ప్రవేశించింది. ఆ తరువాత కొన్నాళ్ళకు ఇంటికి చేరిన మంజరికి మరో మగాడు తారసపడ్డాడు. పెళ్ళి చేసుకుంటాను. నువ్వు వృత్తి కూడా చేయనక్కరలేదని మభ్యపెట్టాడు. అయితే ఆ మాట మీద అతగాడు నిలబడలేదు. దీంతో మరో మారు బలవంతంగా వృత్తిలోకి ప్రవేశించిన మంజరి ఓ రోజు పోలీసులకు చిక్కింది. అలా చిక్కడమే ఆమె జీవితంలో మార్పును తెచ్చింది. పోలీసులు ఆమెను హెల్ప్హోమ్లో చేర్చారు. హోమ్లో చేరాక, కౌన్సిలింగ్ తీసుకున్న మంజరి ఇక తిరిగి వెనక్కు వెళ్ళదలుచుకోలేదు. హోమ్లోనే ఉంటూ కౌన్సిలింగ్ కోసం ఇక్కడకొచ్చే అమ్మాయిల జీవితాల్లో మార్పు కోసం ప్రయత్నిస్తానంటోంది. వృత్తిలో కొన్ని తాత్కాలిక ఆకర్షణలుంటాయి. వాటికి లొంగకుండా అమ్మాయిల్లో మానసిక పరివర్తన, మనోబలం కలిగించే విధంగా కౌన్సిలింగ్ ఇస్తున్నానంటోంది. పిల్లలకు దూరమయ్యాననే బాధ ఉన్నప్పటికీ మోసపోయి ఇక్కడకు వచ్చిన పిల్లల్లోనే తన బిడ్డలను చూసుకుంటూ వాళ్ళలో పరివర్తన తెస్తూ సంతోషపడుతున్నానని మంజరి చెప్పింది.

## ఫీల్డ్ వర్కర్-శాంత కుటుంబం

మీరు పనిచేస్తున్న సంస్థ వారు మిమ్మల్ని శాంత తాలూకు కుటుంబ సభ్యులను కలిసి, శాంత హైదరాబాద్ నుండి తిరిగి వస్తున్న సందర్భంగా ఏమి చేయదల్చుకున్నారు వారికి ఏమి కావాలి అనే దానిపై చర్చించి రమ్మని కోరారు. మీకు సంస్థ వారు అందించిన వివరాల ప్రకారం శాంత తన ఇంటికి తిరిగి వెళ్ళాలని కోరుకుంటున్నది. పైగా ఆమె గర్భవతి అయినందున తన వాళ్ళు తనను ఏ విధంగా స్వీకరిస్తారు అనే దాని గురించి తీవ్రంగా భయపడుతున్నది. పైగా తన కుటుంబానికి ఇవ్వడానికి తన వద్ద పైసా గూడా లేదు. తను తిరిగి ఇంటికి వెళ్ళిన తరువాత ఏమి చేసి డబ్బు సంపాదించాలో కూడా తెలియని పరిస్థితిలో ఉంది.

మీరు శాంత తాలూకు కుటుంబం ఎక్కడ నివసిస్తున్నదో తెలుసుకోగలిగారు. ఈ రోజే మొట్టమొదటి సారిగా మీరు వారిని కలవబోతున్నారు. వారితో మాట్లాడటం సాధారణ చర్చగానే ఉండాలి కానీ ఆమె గర్భవతి అయి వస్తున్నందున, ఆమె వద్ద డబ్బు ఏమి లేకుండా వస్తున్నందుకు ఆ కుటుంబ సభ్యుల భావాలు ఎలా ఉన్నాయి అనే దానిని నిశితంగా పరిశీలించాలి. ఆ కుటుంబానికి ఏ విధమైన సహకారాన్ని అందించాలి, శాంత తిరిగి రావటం గురించి వారి అభిప్రాయాలెలా ఉన్నాయనేది మీరు తెలుసుకోవాలి. ఆ అమ్మాయి తిరిగి వస్తే, ముఖ్యంగా గర్భవతిగా తిరిగి వస్తే వారు ఆదరించడానికి సిద్ధంగా ఉన్నారా అనే విషయంపై గూడా మీరు బేరీజు వేయండి.

# బాధితురాలిని తిరిగి ఇంటికి చేర్చడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు

కేసును నమోదు వేయాలి, వ్రాతపూర్వకంగా నమోదు చేయాలి. (కుటుంబ విషయాలు: ఎక్కడ నుండి తీసుకురాబడింది; తిరిగి ఇంటికి వెళదామన్న ఆసక్తి మొదలైనవి)

తిరిగి వెళ్ళదలుచుకున్న అమ్మాయికి, తనంతట తనే వెళ్ళదలుచుకుందా? లేక ఎవరి సహాయంతోనైనా (ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థల సహాయంతో) వెళ్ళదలుచుకుందా? ఏ రకంగానైనా వెళ్ళవచ్చన్న సంగతి ఆమెకు చెప్పి, ఆ రెండింటిలోని సాధకబాధకాలను ఆమెకు తెలియపరచాలి. ప్రయాణ పత్రాలను నింపడంలో, పొందటంలో ఆమెకు సహాయాన్ని అందించాలి.

ఆ అమ్మాయి తాలుకా సమాచారాన్ని ఆమె వూరి నుంచి సేకరించడం, దాన్ని ఆమె చెప్పిన వివరాలతో సరిపోల్చుకోవడం, ఇప్పటికీ ఆమె తన కుటుంబంతో కలిసిపోవడానికి ఇష్టపడుతున్నదేమో తెలుసుకోవాలి

అమ్మాయిని పంపిస్తున్న వూరిలోని పార్టనర్ సంస్థతో మాట్లాడి క్షేమంగా ప్రయాణం చేయడానికి అనువైన సమయం నిర్ణయించుకోవాలి.

ఇంటికి వెళ్లే వ్యక్తిని మానసికంగా సిద్ధపరచాలి. ఆమె తిరిగి వెళ్ళినప్పుడు కుటుంబసభ్యులు, స్నేహితులు, ఇతరులు ఎలా ప్రవర్తిస్తారు? తన అనుభవాలను గురించి ఆమె ఏమని చెప్పాలి. ఆమె రోజులెలా వెళ్ళదీయాలి మొదలైన వాటిపై ఆమెకు ఆచరణాత్మక సూచనలు అందించాలి.

తమ కుటుంబాన్ని గుర్తించమని ఇచ్చిన వినతిపత్రాన్ని తీసుకోవడం, బాధితురాలి సొంత ప్రాంతం గురించిన విషయం సేకరించాలి. (ఊరు, తల్లిదండ్రుల పేర్లు మొదలైనవి)

స్వదేశానికి పంపడానికి ముందుగా వారి కుటుంబాన్ని గురించి అంచనావేయాలి. ఆ ప్రదేశానికి సమాచారం అందించాలి.

తిరిగి వస్తున్న వ్యక్తిని ఆదరించేలా కుటుంబ సభ్యులను మానసికంగా సూర్పడం, ఆమె పట్ల వారెలా ప్రతిస్పందిస్తున్నదీ తెలుసుకోవడం

తిరిగి వెళుతున్న బాధితులకు వాళ్ళు వెళ్ళే ముందు తగిన రవాణా పత్రాలు, ఇతరత్రా అవసరమైన కాగితాలను అందించాలి. వారి స్వంత ప్రదేశానికి ఎలా వెళ్ళాలో, ఎంత ఖర్చవుతుందో మొదలైన సమాచారాన్ని వారికి ఇవ్వాలి.

ఆమె తిరిగి సొంతప్రాంతానికి వెళ్ళగానే ఆమె రాక కొరకు వేచి ఉండి ఆమెను భద్రంగా ఇంటికి చేర్చేలా ఏర్పాట్లు చేయాలి.

జాగ్రత్తగా త్రిప్పి పంపడం: తిరిగి వెళుతున్న వారికి తోడుగా వెళ్ళి భద్రంగా వూరికిచేరడంలో సహాయపడాలి.

**పునరేకీకరణ:** వెళ్ళిన చోట అవసరమైన సమయంలో సహాయపడగలిగిన వ్యక్తుల, సంస్థల చిరునామాలు, ఫోన్ నెంబర్లు అందచేయాలి. అక్కడ లభించే ఆరోగ్య పరిరక్షణ కేంద్రాలను గురించిన సమాచారం ఇవ్వాలి. అవసరమైన పక్షంలో వారి ఆరోగ్య పరిస్థితిని గురించిన రికార్డులు పంపించాలి. ఆమె ఇష్టపడే పక్షంలో తనలాగే బాధలు పడి ఆయా ప్రాంతాలకు చెంది అక్కడ ఉన్న వారి సమాచారం ఇవ్వవచ్చు.

ఆమె మంచిచెడులు గురించి ఆమె ఊరి నుండి సమాచారం తెప్పించుకోవాలి.

ఆమె ఏ ఊరి నుండి వచ్చిందో అక్కడి ఏజెన్సీకి ఆమె సమాచారం ఎప్పటికప్పుడు తెలియపర్చాలి.

## బాధితులను రక్షించిన తరువాత ఎన్‌జిఓల పాత్ర

బాధితులను రక్షించిన తరువాత సేవా సంస్థలు చేయాల్సిన కార్యక్రమాలు చాలా ఉన్నాయి. వాటిలో కొన్ని

- కౌన్సిలింగ్ చేయడం ద్వారా బాధితులకు ఉపశమనం కల్పించడం
- ఐటిపి చట్టం సెక్షన్ 15( 6ఎ) క్రింద బాధిత వ్యక్తులతో ఇంటర్వ్యూ నిర్వహించడం తప్పని సరి చర్య
- బాధిత వ్యక్తులకు ఏఏ చర్యలు తీసుకోవడం ద్వారా ఎక్కువ మేలు జరుగుతుందో గుర్తించడంలో పోలీసులకు పూర్తి సహాయ సహకారాలు అందించడం ద్వారా ఆయా చర్యలు పోలీసు అధికారులు తీసుకోగలుగుతారు.
- పోలీసులకుపరిశోధనలలో ముఖ్యంగా అక్రమ రవాణాకు గురైన వ్యక్తుల గురించి, అక్రమ రవాణా చేసే పద్ధతుల గురించి కీలక విషయాలు తెలియచేయడం
- అవసరమైన పక్షంలో అనువాదకులను ఏర్పాటు చేయడం
- బాధితులను శక్తివంతులుగా చేయడానికి క్రింద పేర్కొన్న పునరావాస కార్యక్రమాలు ఏర్పాటు చేయడం
- బాధితులకు విషయంపై అవగాహన, ప్రేరణ కలుగచేసి తగిన విధంగా సిద్ధపరచడం
- బాధితులకు అవసరమైన కార్యక్రమాలను గుర్తించడం
- బాధితులకు తగిన విజ్ఞానాన్ని , నైపుణ్యాన్ని, పునరావాస సౌకర్యాలను గురించిన పరిజ్ఞానాన్ని అందచేయడం, ఆర్థిక వనరులు అందే అవకాశాలను తెలియచేయడం, ఇందుకు గాను పనిచేస్తున్న సంస్థలను ఇతరులను కలుపుకుపోవడం
- కార్యక్రమాలు యధావిధిగా జరగడానికి తగిన నెట్వర్క్ ను ఏర్పాటుచేయడం.
- ఉత్పత్తులకు తగిన మార్కెట్ కల్పించడం, మార్కెట్ సమాచారాన్ని అందించడం
- పథకాలు ఆగిపోకుండా అమలు చేయడం ద్వారా తిరిగి బాధితులు అక్రమ రవాణాకు గురి కాకుండా చూడటం
- ట్రాఫికింగ్ నియంత్రణలో ఎన్జిఓలు కీలక పాత్ర పోషించాలి. వ్యూహాత్మకంగా వ్యవహరించాలి.

కోర్టులో కేసుల విచారణ సందర్భంలో నిందితులను విచారించే సందర్భాలలో వారికి శిక్షలు పడే విధంగా ఎన్జిఓలు నిర్మాణాత్మక పాత్రను పోషించాలి. ఇంతకు ముందు కాలంలో ఈ దిశగా కొంత మంచి కృషి జరిగినప్పటికీ, ప్రస్తుత కాలంలో ఈ విషయంలో ఎక్కువగా శ్రద్ధ కనిపించడం లేదు. పోలీసులు, న్యాయవాదులు, ఎన్జిఓలతో క్రింద చూపిన విధంగా కలిసి పనిచేయవచ్చు.

- బాధితులకు, సాక్షులకు కోర్టులో విచారణ జరిగే విధానాన్ని గురించి తెలియచెప్పి, కోర్టులో ఎలా సాక్ష్యమివ్వాలి అనే దానిని వారికి వివరంగా చెప్పడం ద్వారా వారికి భయం పోగొట్టి వారిని సిద్ధపరచవచ్చు. పిల్లల ఆలోచనలను, భావాలను విశదీకరించడంలో సహాయపడవచ్చు.
- ఎన్‌జిఓలు బాలల మనస్తత్వాన్ని తెలుసుకొని బాధిత బాలలకు కోర్టులో సహాయపడవచ్చు.

- స్త్రీ, శిశు అభివృద్ధి, సంక్షేమ, పోలీసు శాఖలతో భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకోవాలి
- సమాజంలోని వ్యక్తులతో కలిసి పనిచేయాలి. అక్రమ రవాణా నిరోధానికి, సమగ్రమైన ప్రయత్నం జరగాల్సి ఉన్నందున చట్టం అమలుపరిచే అధికారులైన పోలీసు, న్యాయవాదులు, ఇతర శాఖలు సమాజంలోని ప్రభుత్వేతర సంస్థలు, ప్రజా సంఘాలు, మేధావులు, సంఘ సేవకులు మొదలైన వారి అందరితో కలిసి కార్యక్రమాలు చేపట్టాలి.
- ఈ విషయంలో పంచాయితీరాజ్ సంస్థలు ప్రముఖ పాత్రను పోషించగలవు. ఇవి బాధితులను గుర్తించడంలోనూ, అక్రమ రవాణాదారులపై నిఘా పెట్టడానికి, ప్రజలను మేల్కొల్పడానికి, వారికి తగిన సలహాలు, సూచనలు ఇవ్వడానికి/ ఉపకరిస్తాయి.

## తప్పిపోయిన వ్యక్తుల గురించి

అక్రమ రవాణాకు, వ్యక్తులు తప్పిపోయిన కేసులకు గట్టి అవినాభావ సంబంధం ఉంది. అక్రమ రవాణా నిరోధానికి క్రింద సూచించిన చర్యలు అవసరం అవుతాయి.

- అక్రమ రవాణాకు గురైన వ్యక్తులకు, తప్పిపోయిన వ్యక్తులకు గల సంబంధాన్ని అర్థం చేసుకోండి.
- వేశ్యా గృహాల నుండి, అక్రమ రవాణాకు వ్యక్తులు గురవుతున్న ప్రాంతాల నుండి రక్షించబడిన బాధితుల వివరాలను, దేశ వ్యాప్తంగా తప్పిపోయినట్లుగా రిపోర్టు చేయబడిన కేసుల తాలుకా వివరాలతో పోల్చి చూడండి..
- తప్పిపోయినట్లు నమోదైన కేసులకు, అక్రమ రవాణాకు మధ్య గల సంబంధం : అక్రమరవాణాదారులను, వారు అక్రమ రవాణా చేస్తున్న మార్గాలను, విధానాలను గురించి తెలుసుకోడానికి సహాయపడుతుంది.
- తప్పిపోయిన మహిళలు, బాలలకు సంబంధించిన కేసులను కడదాకా పరిశీలించి ఒక తార్కిక ముగింపుకు వచ్చే దాకా గమనించండి. ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి సమస్య మొదళ్ళ వరకు పరిశీలించి తప్పిపోయిన వ్యక్తులను కనుగొని, రక్షించి, వారి వారి ఇళ్ళకు చేర్చాలి. ఈ ప్రక్రియలో ఏ ఏ వ్యక్తులు పాల్గొని బాధితులు అక్రమ రవాణాకు గురి కాబడడానికి సహకారాన్నందించారో అలాంటి వారిపై ఏ చిన్న అనుమానమొచ్చినా వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసు పెట్టి, పకడ్బందీగా విచారణ జరపాలి.
- మనం గమనించినట్లయితే తరచుగా తప్పిపోయిన వారినే తప్పిపోవడానికి బాధ్యులుగా చేసే విషయం చూస్తుంటాము. అయితే ఇక్కడ తెలుసుకోవలసిన విషయమేమిటంటే బాలలందరూ బాధిత వర్గాలకు చెంది రక్షణ, సహకారం అందించాల్సిన వారే అవటం మనం గమనించాలి.
- తప్పిపోయిన బాలల సమాచారాన్ని, పోలీసులకు, ఈ విషయంగా కృషి చేస్తున్న ఎన్జిఓలకు అందించినట్లయితే వారు కూడా తగిన చర్యలు చేపట్టడానికి అవకాశం ఏర్పడుతుంది.
- ఎన్జిఓలు/హెల్ప్‌లైన్/ఛైల్డ్ లైన్ సంస్థలు సంయుక్తంగా ఏర్పడి తప్పిపోయిన వ్యక్తులు, రక్షింపబడిన బాధితుల సమాచారాన్ని సమగ్రంగా సేకరించి సమాచార మార్పిడి చేసుకోవాలి.

- ఒక ప్రత్యేక ప్రాంతానికి సంబంధించి, నిర్ణీత కాలంలో తప్పిపోయిన వ్యక్తుల సమాచారాన్ని సేకరించి ( ఉదాహరణకు ఒక పోలీసు స్టేషన్ కు సంబంధించిన ఏరియాలో ఒక సంవత్సరంలో వారిని కనుగొనడానికి తీవ్రంగా ప్రయత్నించాలి.) వారిలో ఏ ఒక్కరి సమాచారమైనా దేశంలోని ఏ ప్రాంతంలోని వ్యభిచార గృహంలో బయటపడినా తీగంతా కదిలినట్లే. డొంకంతా బయటపడే అవకాశం ఉంటుంది. ఎవరి ద్వారా రవాణా అయినారో తెలిస్తే, వారిని పట్టుకొని విచారించి మిగిలిన వారి సంగతి తెలుసుకోవచ్చు.

- ఇప్పుడు ఉన్న హెల్ప్‌లైన్లతో అనగా ఉమన్స్ హెల్ప్‌లైన్, చైల్డ్ హెల్ప్‌లైన్, మొదలగు సంస్థలతో ఎన్జిఓలు కలిసి నెట్వర్కు ఏర్పాటు చేసుకోవాలి. వీటిని మరలా పోలీసు కంట్రోలు రూంతోను, పోలీసు స్టేషన్‌తోను అనుసంధానించడం వల్ల సత్వర ప్రయోజనం పొందవచ్చు.

- **స్థానిక సంస్థలను వినియోగించుకోవడం:** పంచాయితీరాజ్ సంస్థలకు స్థానిక ప్రజలతో చక్కని సంబంధాలు ఉంటాయి. వారి సేవలను సక్రమంగా వినియోగించుకోవడం ద్వారా అక్రమ రవాణా నియంత్రణా మార్గాలు సమర్థవంతంగా ఏర్పాటు చేసుకోవచ్చు.

## మనం ఏమి చేయాలి?

- అక్రమరవాణా నేరం అన్న విషయాన్ని సమాజానికి తెలియజేయాలి. ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా మాట్లాడాలి. ఌ
- స్త్రీలకు, పిల్లలకు చదువు పట్ల, ఇతర వృతి విద్యా శిక్షణల పట్ల ఆసక్తిని పెంచాలి.
- బాధిత మహిళలకు, పిల్లలకు అక్రమ రవాణాదారుల గురించి అవగాహన కలుగచేయాలి. ఉన్నచోటనే ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలి.
- మనకు తెలిసిన వారికి మోసపు వ్యక్తులు వారి మాటల పట్ల ఆకర్షితులు కాకుండా జాగ్రత్తలు చెప్పాలి.
- 18 సంవత్సరాల లోపు బాలల డేటాను సేకరించాలి.
- కమ్యూనిటీలో ట్రాఫికింగ్ గురించి ప్రచారాన్ని చేపట్టాలి.
- ట్రాఫికర్లను గుర్తించి ఆ విషయాన్ని కమ్యూనిటీ పెద్దల దృష్టికి తీసుకువెళ్ళాలి.
- వృత్తిలో ఉన్న మహిళల పిల్లలను గుర్తించి వారికి ట్రాఫికింగ్ పై అవగాహన కల్పించాలి.
- రెండోతరం మరలా వృత్తిలోకి ప్రవేశించకుండా విద్యావకాశాలు కల్పించాలి.

## అక్రమ రవాణా బాధితులపై జరిగే నేర పూరిత చర్యలువారి హక్కులకు భంగం కల్పించుట

- ప్రస్తుత పరిస్థితులలో 'అక్రమరవాణా' అంటే వ్యభిచార మేనా అనే అయోమయం నెలకొంది. అక్రమ రవాణా యొక్క తీవ్రతను గుర్తించలేక పోతున్నారు. దానిపై సరైన అవగాహన కూడా లేకుండా పోతోంది. ఈ నేపథ్యంలో అక్రమ రవాణాకు గురైన బాధితుల పట్ల జరిగిన నేరాలు, అన్యాయాలు, అక్రమాలు, ఘోరాలు గురించిన చిట్టా ఇవ్వడం సబబుగా ఉంటుందన్న భావనతో భారత శిక్షాస్మృతిలో ఎలాంటి నేరం ఏ సెక్షన్ లో పొందుపర్చబడిందో ఇస్తున్నాం.

అక్రమ రవాణాకు గురైన బాధిత మహిళలకు ఓదార్పునందించి, వారిని మాట్లాడించగలిగితే ఎప్పుడూ వినని ఎన్నో కథలు వింటాం. ఒక ప్రత్యేకమైన ఉదాహరణ తీసుకుంటే అక్రమ రవాణాకు గురైన ఒక బాధిత బాలిక శిక్షాస్మృతిలోని కింద చూపిన అనేక అక్రమాలకు గురై ఉండవచ్చు.

- ఒక మహిళ తన వర్గపు ప్రజల నుండి వేరు చేయబడినట్లయితే, బలవంతంగా భయపెట్టి ఎత్తుకుపోయినందుకు, కిడ్నాప్ చేసినందుకు(సెక్షన్లు 361, 362, 365, 366 క్రింద శిక్షించవచ్చు)
- చట్ట విరుద్ధంగా ఆమెను సేకరించినట్లయితే (శిక్షాస్మృతి 366-ఎ క్రింద)
- ఎవరి చేతనైనా అమ్మబడినట్లయితే (ఐపిసి 372 క్రింద)
- ఎవరి చేతనైనా కొనబడినట్లయితే (ఐపిసి 373 క్రింద)
- ఇతర దేశాల నుండి దిగుబడి చేసుకున్నట్లయితే (ఇతర దేశాలకు చెందిన అమ్మాయి అయినా, జమ్ము రాష్ట్రానికి చెందిన అమ్మాయైనా, 21 సంవత్సరాల కన్నా చిన్న వయస్సుదైనా, ఐపిసి 366 బి క్రింద)
- బలవంతంగా ఎక్కడకూ పోనివ్వకుండా ఆపినా (ఐపిసి 339)
- బంధించినా (ఐపిసి 340)
- భౌతికంగా హింసించినా - బాధించినా ( ఐపిసి 327, 329)
- నేర పూర్వకమైన బలప్రయోగం చేసినా (ఐపిసి 350)
- మానసికంగా హింసించినా, బాధించినా (ఐపిసి 351 క్రింద).
- నేరపూర్వకంగా మధ్యవర్తిత్వం చేసినా (ఐపిసి 506 క్రింద)
- ఆమె గౌరవానికి భంగం కల్పించినా (ఐపిసి 354 క్రింద)
- బలవంతంగా మానభంగం/గాంగ్రేప్/మరల మరల మానభంగానికి గురి చేయడం( ఐపిసి 375 క్రింద)
- అసహజ నేరాలకు, శృంగారాలకు గురి చేసినా (ఐపిసి 377 క్రింద)

## వాణిజ్యపరమైన లైంగిక దోపిడికి ఐటిపి చట్టంలో శిక్షలు

- వేశ్యాగృహాన్ని కలిగి ఉన్నా, నిర్వహిస్తున్నా (లేదా అందుకు సహకరిస్తున్న) లేదా తనకు సంబంధించిన గృహాన్ని వేశ్యాగృహంగా ఉపయోగించడానికి అంగీకరించినా ( వాహనాలతో సహా) ఐటిపి చట్టం సెక్షన్ 3 క్రిందగు వేశ్యా వృత్తి ద్వారా వచ్చే సంపాదనపై జీవిస్తున్నా కొంత మేరకైనా) ఐటిపి చట్టం సెక్షన్ 4 క్రింద
- వేశ్యావృత్తి కొరకు వ్యక్తులను సేకరించుట, ప్రేరేపించుట, అక్రమ రవాణా చేయుట, వ్యభిచారం నిమిత్తం వ్యక్తులను తీసుకువెళుతున్నా లేదా పై వాటి కొరకు ప్రయత్నించినా ఐటిపి చట్టం సెక్షన్ 5 క్రింద గానీ) ఐటిపి చట్టం సెక్షన్ 6 క్రింద

- ఒక వ్యక్తిని వ్యభిచారం జరిగే ప్రదేశంలో తన ఆధీనంలో ఉంచుకున్నట్లయితే (వేశ్యాగృహం గానీ మరో ప్రదేశమైనా గానీ) ఐటిపి చట్టం సెక్షన్ 6 క్రింద
- బహిరంగ ప్రదేశాలకు దగ్గరలో ఎవరైనా వేశ్యావృత్తిని నిర్వహిస్తున్నా, ఎవరిచేతనైనా నిర్వహింప చేస్తున్నా (హోటళ్ళ, వాహనాలు మొదలగు వాటితో సహా) ఐటిపి చట్టం సెక్షన్ 7 క్రింద
- బహిరంగ ప్రదేశాలలో గానీ, బహిరంగ ప్రదేశానికి దగ్గరలో గాని వ్యభిచార వృత్తి కొరకు వ్యక్తులను ఆకర్షించే ప్రయత్నాలు చేసినా- సెక్షన్ 8 క్రింద (ఐటిపి చట్టం)
- నిర్బంధంలో ఉన్న వ్యక్తిని వ్యభిచారానికి ప్రేరేపించుట( తన నిర్బంధంలో ఉన్న వ్యక్తిని వ్యభిచారం కొరకు ప్రోత్సహించినా అందుకు సహాయ సహకారాలు అందించినా) – ఐటిపి చట్టం సెక్షన్ 9 ప్రకారం

**బాల నేరస్థుల చట్టం 2000 కూడా కొన్ని చర్యలను నేరాలుగా చెప్పింది.**

ఎవరైనా తన ఆధీనంలో ఉన్న బాలలను శారీరకంగా హింసించడం, పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం లేదావారిపై దాడి జరిగే పరిస్థితులు కల్పించడం మానసిక, శారీరక బాధలకు గురి చేయడం గానీ చేసినట్లయితే ఈ చట్టం సెక్షన్ 23 ప్రకారం శిక్షార్హులవుతారు.

అక్రమ రవాణాకు గురైన వారి విషయంలో అనేక రకాలుగా వారి హక్కులకు భంగం కల్పించడం జరుగుతున్నది. అలాంటివాటిలో కొన్ని ఈ విధంగా ఉన్నాయి.

- జీవించే హక్కును హరించడం ( బానిసలుగా చూడటం)
- రక్షణ హక్కుని హరించడం
- గౌరవానికి భంగం కల్పించడం
- వాళ్ళకు గల న్యాయపరమైన హక్కులను హరించడం, వారి బాధలు తీర్చలేకపోవడం
- ఆరోగ్య సేవలు అందించకపోవడం
- వ్యక్తిగత నిర్ణయాలు తీసుకునే హక్కు హరించడం తిరిగి అక్రమ రవాణా చేయడం)
- తిరిగి తమ వారిని కలువనీయకపోవడం
- వివిధ రకాల బాధలు (ఉదాహరణకు అక్రమ రవాణా కాబడిన వ్యక్తిని పాస్ పోర్టు/వీసాలు లేవనో వ్యభిచారాన్ని ప్రోత్సహిస్తున్నారనో శిక్షించడం)
- తనను గురించి తను చెప్పుకునే హక్కుని నిరాకరించడం
- నిర్ణయం చేయబోయే ముందు వారికి చెప్పుకునే హక్కు అవకాశం కల్పించకపోవడం

- ఈ విధంగా చెప్పుకుంటూ పోతే రాజ్యాంగం, ఇతర ఒడంబడికలు, ఒప్పందాల ద్వారా ఏర్పాటు చేయబడిన, కల్పించబడిన అనేక హక్కులకు భంగం కలుగుతూనే ఉన్నాయి.

బాధిత వ్యక్తులను/ప్రాంతాలను పరామర్శించడం దర్శించడం అనేది అక్రమ రవాణాను అదుపు చేసే చర్యలలో ప్రధానమైన, వ్యూహాత్మకమైన అంశం. సంబంధిత ప్రభుత్వ శాఖలు ఇతర సేవా సంస్థల వారితో అవినాభావ సంబంధాలు పెంపొందించుకోవడం ద్వారా పోలీసు శాఖ క్రింద తెలిపిన విధంగా చేయవచ్చు.

- బాధిత వ్యక్తులను/ప్రాంతాలను గుర్తించి వారిపై తగిన శ్రద్ధ పెట్టడం, వారిని శక్తివంతులుగా తీర్చిదిద్దడానికి ప్రాధాన్యతనివ్వడం..
- తీవ్రంగా బాధలకు గురైన వ్యక్తులపై ప్రత్యేక శ్రద్ధతో సత్వర చర్యలు చేపట్టడం (ఉదాహరణకు వేశ్యా గృహాలలోని బాల బాలికలు)
- వ్యక్తులను అక్రమ రవాణా చేయడానికి, బాధితులుగా మార్చడానికి తగిన ప్రాంతాలైన బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రోడ్డు ప్రక్కన ఉండే ధాబాలు మొదలైన వాటి వద్ద నిఘా పెంచి నేరగాళ్ళను, మోసగాళ్ళను పట్టుకోవడం
- ప్రభుత్వ శాఖలు ఇతర మల్టీ నేషనల్ కంపెనీలతో కలిసి బాధితులను శక్తివంతులుగా చేసే పథకాలు, తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేయడం
- అనేక సంస్థలను ఈ కార్యక్రమంలో పాల్గొనేటట్లు చేసి, బాధితులకు జీవనాధారం కల్పించడం
- అన్ని కార్యక్రమాలలో, పథకాలలో సంక్షేమ దృష్టిని పక్కన పెట్టి మానవ హక్కుల సాధనవైపు దృష్టి మరల్చేటట్లు చేయాలి. దీనికి గాను ప్రజా దృష్టిని ఆ వైపుగా మళ్ళించడానికి (హక్కుల సాధన) సేవా సంస్థల సహకారాన్నిపొందాలి.

## చట్టపరమైన అవగాహన కల్పించుట

- లింగవివక్ష, కుటుంబ హింస, వరకట్న దురాచారం మొదలైన వాటికి వ్యతిరేకంగా పోరాడాలి.హక్కులను గురించి అవగాహన కల్పించాలి.
- రవాణాదారుల నుండి తప్పించుకున్న వారిని సమాజం ఆదరించేటట్లు పునరావాసాన్ని కల్పించుట చేయాలి.

## అక్రమరవాణా – భారతీయ చట్టాలు:

- భారత రాజ్యాంగం ఆర్టికల్ 23 ప్రకారం బలవంతంగా శ్రమ చేయించడం, అక్రమరవాణా కార్యకలాపాలు నిషేధించబడ్డాయి.
- భారత శిక్షాస్మృతి ప్రకారం అక్రమరవాణా కార్యకలాపాలు నిషేధించబడ్డాయి.
- ఒక వ్యక్తి ఇతరులను ఎవరినైనా స్త్రీ, పురుష, పిల్లలను కిడ్నాప్ చేసినచో, వారిని బానిసలుగా వాడుకొనినచో కఠినముగా శిక్షించబడును.

- ఐ.టి.పి. చట్టం ప్రకారం ఏ వ్యక్తినైనా అక్రమ రవాణా గావించి లైంగికంగా దుర్వినియోగపరిచినా శిక్షార్హులగుదురు.

**అక్రమరవాణాకు శిక్షలు:**

- చేసిన నేరాన్ని బట్టి అక్రమరవాణాకు పాల్పడిన వ్యక్తులను 7 సంవత్సరాల నుండి యావజ్జీవిత శిక్ష వరకు విధించవచ్చును.
- ఇతరులను తన వద్ద బందీగా ఉంచుకున్నచో 1 నుండి 3 నెలల జైలు శిక్ష విధించవచ్చును.
- భౌతిక దోపిడీ కొరకు వ్యక్తిని అక్రమరవాణా చేసిన ఎడల 7 సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా విధించబడును.
- కిడ్నాప్ చేసినచో 7 సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా విధించబడును.
- వేశ్యావృత్తి కొరకు ఒక వ్యక్తిని అమ్మినచో 7 సంవత్సరముల జైలు శిక్ష, జరిమానా విధించబడును.
- చిన్న పిల్లలను కిడ్నాప్ చేసి యాచక వృత్తికి వినియోగించిన ఎడల 10 సంవత్సరాల జైలు శిక్ష మరియు జరిమానా విధించబడును.
- బలవంతంగా వ్యభిచారము కొరకు ఎవరినైనా అమ్మిన ఎడల 14 సంవత్సరముల యావజ్జీవ కారాగార శిక్ష విధించబడును.

**ట్రాఫికింగ్ పై అపోహలు-వాస్తవాలు**

**అపోహ 1:** బానిసత్వం వెనుక ఎప్పుడో జరిగిన సంగతి. మానవ అక్రమ రవాణాకు కూడా ఎప్పుడో ఎక్కడో జరుగుతుంటుంది.

**వాస్తవం :** గణాంకాలు చాలా తేడాలు చూపిస్తూ ఖచ్చితంగా చెప్పలేకపోయినప్పటికీ, ఆధునిక బానిసత్వం స్పష్టంగా సమాజంలో చాలా ఎక్కువగా ఉందని చెబుతున్నాయి.

**అపోహ 2 :** అక్రమ రవాణాకు గురవుతున్న వారంతా మహిళలే.

**వాస్తవం :** అక్రమ రవాణాకు గురవుతున్న వారిలో మహిళలే ఎక్కువ మంది ఉన్నప్పటికీ, మగవాళ్ళ సంఖ్య కూడా పెరుగుతూనే ఉన్నది. 2004 సంవత్సరం లెక్కల ప్రకారం బాధితుల్లో 30 శాతం మంది మగవారే. కొన్ని దేశాలలో ఆడవారి కన్నా మగవారే అక్రమ రవాణాకు గురవుతున్నారు.

**అపోహ 3:** బలవంతంగా సెక్సు పరిశ్రమలో పనిచేసే వారి గురించి తెలిపేదే మానవ అక్రమ రవాణా

**వాస్తవం :** ఇందులో రెండు రకాలున్నాయి 1. సెక్సు పరిశ్రమ కొరకు అక్రమ రవాణా 2. వెట్టిచాకిరి కొరకు బలవంతంగా, మోసపూరితంగా, భయపెట్టి అక్రమ రవాణా చేయడం

**అపోహ 4 :** అక్రమ రవాణాకు గురైన బాధితులంతా గ్రామీణ ప్రాంతాలకు చెందిన చదువురాని వారే.

**వాస్తవం :** చాలా మంది అక్రమ రవాణా బాధితులు ప్రాథమిక, మాధ్యమిక విద్యనభ్యసించిన వారే. ఉదాహరణకు మన దేశంలో ఇంటి చాకిరి చేస్తున్న చాలా మందికొంత మేరకు చదువుకున్న వారే. అలాగే అనేక మంది బాధిత మహిళలు డిగ్రీ దాకా చదివిన వారే..

**అపోహ 5 :** అక్రమ రవాణాకు గురైన వారంతా పెద్ద పెద్ద నేరస్థుల ముఠా, ఉపాధి కల్పనా కేంద్రాలు, కొత్త వ్యక్తుల వల్ల బాధితులైన వారే.

**వాస్తవం :** మాఫియా లాంటి కొన్ని వ్యవస్థీకృత నేరస్థుల ముఠాలు ప్రపంచ వ్యాప్తంగా వ్యక్తుల అక్రమ రవాణా చేస్తున్నప్పటికీ, బాధితులలో ఎక్కువ మంది స్నేహితుల వల్ల, బంధువుల వల్ల అక్రమ రవాణాకు గురి కాబడిన వారే.

**అపోహ 6 :** ట్రాఫికింగ్ స్మగ్లింగ్ ఒకటే!

**వాస్తవం :** మరొక దేశంలోకి అక్రమంగా చొరబడటంతో కూడిన వ్యవహారం స్మగ్లింగ్. కొందరు స్మగ్లింగ్ కావడానికి రుసుం కూడా చెల్లిస్తుంటారు. మెరుగైన జీవితం కోసం కొంత మంది గైడ్స్ కు రుసుం చెల్లించి సరిహద్దులు దాటే వ్యవహారంలో సహాయం పొందుతారు. ఇలాంటి వారంతా ఏ దేశంలోకి వెళతారో అక్కడ బలవంతంగా చాకిరీ చేస్తుంటారు. వీరంతా ట్రాఫికింగ్ బాధితులు కారు – ఇక నిజంగా బాధితులు ఎప్పుడూ దేశ సరిహద్దులు కూడా దాడి ఉండరు. చాలా మంది కుటుంబాన్ని వదిలి వెళ్ళేవారు బ్రోకర్లు, పింపుల చేతుల్లో చిక్కి వ్యభిచారిణులుగా మారి జీవితాన్ని కొనసాగిస్తుంటారు. వీరంతా ట్రాఫికింగ్ బాధితుల కోవలోకి చేరతారు. సెక్స్ వృత్తిలో కొనసాగుతున్న మైనర్ బాలికలను ట్రాఫికింగ్ కు గురైన వారిగా గుర్తించాలి. వారు బలవంతంగా వృత్తిలో ఉన్నారా లేదా అనే అంశంతో నిమిత్తం లేదు. పై రెండు కేసులను పరిశీలించి చూస్తే ట్రాఫికింగ్ కు, స్మగ్లింగ్ కు సంబంధం లేదని చెప్పుకోవచ్చు. ట్రాఫికింగ్ అనే పదం కదలికను సూచిస్తుంది. కాబట్టి కొంత గందరగోళం సృష్టించవచ్చు. వాస్తవంలో ఒక వ్యక్తి ఎక్కడికి రవాణా కాకుండానే ట్రాఫికింగ్‌కు గురి కావచ్చు.

**అపోహ 7:** ప్రతి రోజు ప్రజలు ట్రాఫికింగ్ ను ఆపలేరు. బాధితులకు సహాయపడలేరు.

**వాస్తవం :** ఈ అపోహలో ఏమాత్రం నిజం లేదు. ట్రాఫికింగ్ బాధితులకు సేవలు కొంత మేరకు అందుబాటులో ఉన్నాయి. కాగా బాధితులను గుర్తించడమే కష్టం. ట్రాఫికర్ల చేతుల్లోంచి ఎప్పుడో కానీ బాధితులు తప్పించుకోలేరు. కమ్యూనిటీలో ఒక వ్యక్తి భార్యనో, చెల్లినో వారి ఇష్టానికి వ్యతిరేకంగా వ్యభిచారం చేయమని హింసిస్తుంటే ఆ విషయాన్ని కమ్యూనిటీ పెద్దల దృష్టికి తీసుకెళ్ళవచ్చు. అలాగే బాలికలను భౌతికంగా హింసిస్తుంటే, వృత్తిలోకి దించాలని ప్రయత్నిస్తుంటే స్పందించవచ్చు. ఒక మహిళ లేదా బాలిక ట్రాఫికింగ్ బాధితురాలిగా మారుతోందని తెలిసిన సందర్భంలో మీరే రంగంలోకి దిగి సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేయవద్దు. అది ప్రమాదకరం. పోలీసులను లేదా స్వచ్ఛంద సంస్థలను సంప్రదించి సమస్యను వారిదృష్టికి తీసుకెళ్ళడం మంచిది.

## రోజువారీ ఫీడ్ బ్యాక్

ప్రతి రోజు వర్క్ షాపు పూర్తవగానే ఈ రిపోర్టు కాపీలను సభ్యులందరికి ఇచ్చి వారి నుండి ఫీడ్ బాక్ తీసుకున్నందు వల్ల తదుపరి సెషన్లో అవసరమైన మార్పులు చేర్పులు చేసుకోడానికి అవకాశం ఉంటుంది. ప్రతి రోజు ప్రారంభంలో ముందు రోజు ఫీడ్ బాక్ అంశాలను ప్రస్తావిస్తూ, వాటికి వివరణలు తెలియచేస్తే సభ్యులందరూ తమ భావనలకు, కామెంట్స్ కు తగిన విలువ ఇవ్వబడిందనే విషయాన్ని గుర్తిస్తారు. వారి పట్ల మీ నిబద్ధతను తెలియచేసే అవకాశం ఉంటుంది. మొత్తం వర్క్‌షాపు పనిని వివరంగా పరిశీలించడానికి మరింత విస్తృతంగా అవసరమైన మేర ఈ పత్రాన్ని తయారు చేసుకోవచ్చు.